సాక్షి విశాఖపట్నం

బుధవారం । 7 । మే । 2025



నర్సుల పోస్టులకు పైరవీలు! 8లో



అధిక ధరలకు విక్రయిస్తున్న స్టాళ్లపై కేసులు 8లో



ఎంఎస్ఎంఈ పార్కుతో యువతకు ఉపాధి 8లో

న్యూస్‌రీల్

నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



శిక్షణ కార్యాచరణపై చర్చిస్తున్న పీడీ సత్యపద్మ, రవికుమార్

ఎంవీపీకాలనీ: పీఎం అజాయ్ పథకంలో భాగంగా ఎస్సీ యువతకు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణకు ఎస్సీ కార్పొరేషన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఎస్సీ కార్పొరేషన్, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ) సంయుక్తంగా ఈ శిక్షణ అందిస్తున్నాయి. ఈ మేరకు ఎస్సీ కార్పొరేషన్ పీడీ సత్యపద్మ, ఎన్ఏసీ డైరెక్టర్ రవికుమార్ మంగళవారం ఈ శిక్షణ కార్యాచరణపై కసరత్తు చేశారు. 18 నుంచి 40 ఏళ్ల వయసు గల ఎస్సీ యువత ఈ ఉచిత నైపుణ్య శిక్షణకు అర్హులని పీడీ సత్యపద్మ తెలిపారు. ఈ నెల 15వ తేదీ లోపు అర్హులైన వారు శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పెదగంట్యాడలోని నాక్ శిక్షణా కేంద్రంలో ఈ శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు 79810 22453, 90632 69849 నంబర్లను సంప్రదించాలన్నారు.

నగరంలో నాకా బందీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

విశాఖ సిటీ: నగరంలో అన్ని ప్రాంతాల్లో పోలీసులు నాకా బందీ నిర్వహించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు విస్తృత తనిఖీలు చేపట్టారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం 7 నుంచి రాత్రి వరకు వాహనాలను తనిఖీలు నిర్వహించారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్, నిర్లక్ష్యంగా డ్రైవింగ్, అధిక లోడ్‌తో ఉన్న వాహనాలపై దృష్టి పెట్టడమే కాకుండా వాహన రికార్డుల పరిశీలించారు. మొత్తం 37 కూడళ్లలో 1,076 వాహనాలను తనిఖీ చేశారు. ఇందులో సరైన రికార్డులు లేని 11 వాహనాలను సీజ్ చేశారు. హెల్మెట్లు లేని 212 ద్విచక్ర వాహనదారుల పైన, నంబర్ ప్లేట్లు సక్రమంగా లేని 13 వాహనాలపై, రెండు ట్రిపుల్ రైడింగ్, 10 డ్రంక్ అండ్ డ్రైవ్, 17 మందిపై మోటార్ వెహికల్ కేసులు నమోదు చేశారు.

కేకే లైన్‌లో రైళ్ల గమ్యం కుదింపు



తాటిచెట్లపాలెం: ఆధునికీకరణ పనుల నిమిత్తం కేకే లైన్‌లో నడిచే పలు రైళ్ల ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. • ఈ నెల 8వ తేదీ నుంచి 15వ తేదీ వరకు విశాఖపట్నం–కిరండూల్(58501) పాసింజర్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. • ఈ నెల 9వ తేదీ నుంచి 16వ తేదీ వరకు కిరండూల్–విశాఖపట్నం(58502) పాసింజర్ దంతేవాడ నుంచి బయల్దేరుతుంది. • ఈ నెల 8వ తేదీ నుంచి 15వ తేదీ వరకు విశాఖపట్నం–కిరండూల్(18515) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. • ఈ నెల 9వ తేదీ నుంచి 16వ తేదీ బయల్దేరే కిరండూల్–విశాఖపట్నం(18516) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతేవాడ నుంచి బయల్దేరుతుంది.

ఘనంగా శ్రీవైష్ణవ శ్రీరామనవమి



అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: మేష శుద్ధ నవమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం శ్రీవైష్ణవ శ్రీరామనవమి(చక్రవర్తి తిరుమగనార్ తిరునక్షత్రం) ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థానమండపంలో అధిష్ఠించి అభిషేకాలు నిర్వహించారు. తదుపరి ఉత్సవమూర్తులకు విశేషాలంకారం చేసి దివ్య ప్రబంధ పారాయణాన్ని పఠించారు.

నేడు ఆపరేషన్ అభ్యాస్

- సివిల్ మాక్ డ్రిల్‌కు సర్వం సిద్ధం
- అత్యవసర సమయాల్లో పౌరుల స్పందనపై అవగాహన



క్వీన్‌మేరీస్ పాఠశాల, ఆక్సిజన్ టవర్స్ వద్ద డ్రిల్

విశాఖ సిటీ: ప్రశాంత విశాఖ యుద్ధ క్షేత్రంగా మారనుంది. వైమానిక దాడుల హెచ్చరిక సైరన్ మోత మోగనుంది. శత్రు దేశ యుద్ధ విమానాలు.. క్షిపణులు.. డ్రోన్లు దూసుకొస్తున్న వేళ.. పౌరుల ఆత్మరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై మాక్ డ్రిల్ జరగనుంది. రక్షణ దళాలు, పోలీసులు, ఫైర్, రెవెన్యూ, వైద్య, ఇతర శాఖల అధికారులు.. సంక్షోభ సమయాల్లో పౌరుల ప్రాణ, ఆస్తి నష్టాలు వాటిల్లకుండా అనుసరించాల్సిన విధానాలను వివరించనున్నారు. కశ్మీర్‌లో ఉగ్రదాడి తరువాత భారత్–పాకిస్తాన్‌ల మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. ఇరుదేశాల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో కేంద్ర హోం శాఖ ముందస్తు చర్యలకు సిద్ధమైంది. సంక్షోభ సమయంలో పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలి, పౌరులు తమ ప్రాణాలు ఎలా కాపాడుకోవాలన్న విషయంపై 'ఆపరేషన్ అభ్యాస్' పేరుతో సివిల్ మాక్ డ్రిల్ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో బుధవారం వన్‌టౌన్ ప్రాంతం, సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్ వద్ద ఈ డ్రిల్ నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో అధికారులు ఏర్పాట్లు చేశారు.

దేశంలో దాడులు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను కేంద్ర హోం శాఖ మూడు కేటగిరీలుగా విభజించింది. ఇందులో విశాఖ కేటగిరీ–2లో ఉంది. యుద్ధమే అనివార్యమైతే విశాఖను కూడా పాకిస్తాన్ టార్గెట్‌గా చేసుకునే అవకాశం ఉందని కేంద్ర హోం శాఖ భావిస్తోంది. అటువంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ఎలా స్పందించాలనే దానిపై అవగాహన కల్పించేందుకు జిల్లా యంత్రాంగం సాయంత్రం 4 గంటలకు వన్‌టౌన్ ప్రాంతంలో ఉన్న క్వీన్‌మేరీస్ పాఠశాల వద్ద, రాత్రి 7.15 గంటలకు ఆక్సిజన్ టవర్స్ వద్ద మాక్ డ్రిల్ నిర్వహించనుంది. ఆ సమయంలో నగరంలో సైరన్ మోత మోగుతుంది. వెంటనే బహిరంగ ప్రదేశాల్లో ఉన్న ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి. పోలీసులు, ఫైర్, ఎస్‌డీఆర్ఎఫ్, వైద్య, రెవెన్యూ, ఇతర స్థానిక అధికారులు ఆ ప్రాంతానికి చేరుకుంటా రు. అత్యవసర పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలో ప్రజలకు అవగాహన కలిగిస్తారు. విద్యుత్ సరఫరా నిలిపివేసి, సురక్షిత ప్రాంతాలకు ప్రజలను తరలించే ప్రక్రియను చేపట్టనున్నారు. సైరన్ మోగినప్పుడు పౌరులు ఎలా స్పందించాలి? విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు (బ్లాక్ అవుట్) తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రథమ చికిత్స కోసం ఇళ్లలో ఉంచుకోవాల్సిన అత్యవసర వస్తువులు, మందులపై ప్రజలకు వివరించనున్నారు.

నేవీ, సివిల్ డిఫెన్స్ ఆధ్వర్యంలో...

అలాగే నేవీ, సివిల్ డిఫెన్స్ ఆధ్వర్యంలో పాత పోస్టాఫీస్ వద్ద గల ఎస్‌బీఐ, కేజీహెచ్ వద్ద గల ఏఎంసీ మహిళా హాస్టల్, దొండపర్తి వద్ద గల డీఆర్ఎం ఆఫీస్, వన్‌టౌన్‌లోని రోజ్ హిల్స్, ఏయూ అవుట్ గేట్ వద్ద ఉన్న జేవీడీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వద్ద మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. ఏయూ నార్త్ క్యాంపస్ వద్ద ఉదయం 10 గంటలకు ఎన్‌సీసీ, ఎన్‌డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ చేపట్టనున్నారు.

మాక్ డ్రిల్ విజయవంతంగా నిర్వహించాలి

మహారాణిపేట: మాక్ డ్రిల్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హరేంధిరప్రసాద్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో మాక్ డ్రిల్ సన్నద్ధతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మాక్ డ్రిల్ విధివిధానాలపై వారికి స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేశారు. యుద్ధం జరిగితే తమను తాము ఎలా రక్షించుకోవాలనే విషయంపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు వివరించారు.

కేటుగాళ్లు కొత్త ఎత్తులు

- ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ నుంచి అంటూ రెస్టారెంట్ ఓనర్లకు ఫోన్లు
- నోటీసు ఇవ్వాలా? గూగుల్ పే చేస్తావా అంటూ బెదిరింపులు
- రాణాచౌదరి పేరుతో నెంబర్ షేర్ చేస్తున్న మాయగాళ్లు
- విశాఖ, అరకు యజమానుల నుంచి వసూళ్లు?



విశాఖ సిటీ : హలో.. ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ నుంచి మాట్లాడుతున్నాం. మీ రెస్టారెంట్‌పై ఫిర్యాదులు వచ్చాయి. రైడ్‌కు వస్తున్నాం. సీజ్ చేయమంటారా? లేదంటే గూగుల్ పే నెంబర్ ఇస్తా.. డబ్బులు పంపిస్తారా? అంటూ ఉమ్మడి విశాఖలో కేటుగాళ్లు బెదిరింపులకు దిగుతున్నారు. రెస్టారెంట్ యజమానులకు ఫోన్లు చేస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. గూగుల్ పే నెంబర్‌కు డబ్బులు పంపించాలని, లేదంటే తనిఖీలకు వచ్చి కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే విశాఖలోనే కాకుండా అరకు రెస్టారెంట్, హోటల్ నిర్వాహకులకు ఫోన్లు చేస్తూ పలువురి నుంచి భారీగా డబ్బు వసూలు చేసినట్లు సమాచారం.

రాణాచౌదరి పేరుతో ఫోన్లు

విశాఖ, అరకుకు చెందిన హోటల్, రెస్టారెంట్ వ్యాపారులకు ఇటీవల కాలంలో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రాణా చౌదరి అనే పేరుతో వరుసగా ఫోన్లు వస్తున్నాయి. లైసెన్సులు తీసుకోకుండా వ్యాపారాలు చేస్తున్నారని, రెస్టారెంట్లు సీజ్ చేస్తామని బెదిరిస్తున్నారు. తమ వద్ద ఫుడ్ లైసెన్సు ఉందని చెప్పినప్పటికీ.. ట్రేడ్ లైసెన్స్ ఎక్స్‌పైర్ అయిందని, లేబర్ లైసెన్సు లేదని ఫోన్‌లో గదమాయించడానికి ప్రయత్నిస్తున్నారు. వాస్తవానికి ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అధికారికి ఫుడ్ లైసెన్సు, ఆహార పదార్థాల నాణ్యత వంటి అంశాలపై మాత్రమే తనిఖీ చేసే అధికారముంది. కానీ సంబంధం లేని లైసెన్సులు అడుగుతుండడంతో పలువురు వ్యాపారులు వారిపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఏదో విధంగా వ్యాపారులను బెదిరింపులకు గురి చేసి వారి నుంచి డబ్బులు గుంజాలని ప్రయత్నిస్తున్నారు.

గూగుల్ పే చేయాలని డిమాండ్

తనిఖీలు, నోటీసుల ఇబ్బందులు లేకుండా ఉండాలంటే గూగుల్ పేకు రూ.20 వేలు పంపించాలని సదరు నకిలీ అధికారి డిమాండ్ చేస్తున్నారు. పలువురు వ్యాపారులు మాత్రం వారిని ఫుడ్ సేఫ్టీ అధికారిగా నమ్మి వారు ఇచ్చిన గూగుల్ పే నెంబర్‌కు డబ్బులు పంపించినట్లు తెలుస్తోంది. ఇలా పదుల సంఖ్యలో వ్యాపారుల నుంచి భారీగా వసూలు చేసినట్లు సమాచారం. అయితే దీనిపై ఇప్పటి వరకు ఎవరూ పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. అయితే ఈ విషయం మాత్రం పలువురు వ్యాపారులు ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. గుర్తు తెలియన వ్యక్తుల నుంచి ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడితే ఫిర్యాదు చేయాలని, ఎవరికీ డబ్బు ఇవ్వాల్సిన అవసరం లేదని వారు వ్యాపారులకు సూచించారు.

హోటళ్లలో పోలీసుల తనిఖీలు

- ఫైర్ ఎన్‌వోసీలు లేకుండా 30 హోటళ్ల నిర్వహణ
- ట్రేడ్ లైసెన్సులు లేకుండా 25, జీఎస్టీ లేకుండా 21 వ్యాపారాలు



రికార్డులు పరిశీలిస్తున్న పోలీసులు

విశాఖ సిటీ : నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉన్న హోటళ్లు, లాడ్జిలలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. జోన్–1, 2 పరిధిలో ఉన్న 74 హోటళ్లలో మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. హోటళ్లలో భద్రతా ప్రమాణాలు, అనుమతులు, రికార్డులను నిశితంగా పరిశీలించారు. ఇందులో అనేక హోటళ్లు, లాడ్జిల్లో కనీస అనుమతులు లేనట్లు గుర్తించారు. ప్రధానంగా అగ్నిమాపక శాఖ నుంచి ఎన్‌వోసీలు లేకుండా 30 హోటళ్లు, ట్రేడ్ లైసెన్సు లేకుండా 25, ఫుడ్ లైసెన్సు లేకుండా 3, జీఎస్టీ లేకుండా 21 హోటళ్లు నిర్వహిస్తున్నట్లు తేలింది. అలాగే 16 హోటళ్లలో సీసీ కెమెరాలు, 32 హోటళ్లలో వీఎంఎస్‌లో సందర్శకుల సమాచారాన్ని అప్‌డేట్ చేయడం లేదని గుర్తించారు. నిబంధనలు పాటించని వ్యాపార సముదాయాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సీపీ శంఖబ్రత బాగ్చి హెచ్చరించారు.

ప్రమాణ స్వీకారానికి ఆహ్వానం

అమర్‌నాథ్, నాగిరెడ్డిని కలిసిన కె.కె.రాజు

మహారాణిపేట: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కె.కె.రాజు మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పార్టీ మాజీ డిప్యూటీ రీజినల్ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నెల 9న జరిగే పార్టీ విస్తృత స్థాయి సమావేశం, అనంతరం పార్టీ అధ్యక్షుడిగా కె.కె.రాజు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో వారిని ఆహ్వానించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, గుడివాడ లతీష్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు రాజాన వెంకటరావు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మహమ్మద్ గౌస్, జిల్లా అనుబంధ విభాగ అధ్యక్షులు సేనాపతి అప్పారావు, బోని శివరామకృష్ణ, పులగం కొండారెడ్డి, చిక్కాల సత్యనారాయణ, పార్టీ నాయకులు భూపతిరాజు శ్రీనివాసరాజు, పల్లా పెంటారావు, మంత్రి శంకర నారాయణ, జీలకర్ర నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి అమర్‌నాథ్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు

సింహాచలంలో సమన్వయలోపం!

ఆర్జిత సేవల రద్దుపై భక్తురాలి ఆగ్రహం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం ఆర్జిత సేవలను రద్దు చేయడంపై ఓ భక్తురాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆలయంలో శ్రీవైష్ణవ శ్రీరామనవమి వేడుకలను నిర్వహించినందున ఆలయ వర్గాలు మంగళవారం ఆర్జిత సేవలను నిలిపివేశాయి. అయితే ఈ విషయాన్ని భక్తులకు ముందుగా తెలియజేయడంలో ఆలయ యంత్రాంగం విఫలమైంది. సోమవారం సాయంత్రం సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయానికి ఓ భక్తురాలు ఫోన్ చేసి మంగళవారం గరుడ సేవ నిర్వహిస్తారా అని వాకబు చేశారు. సిబ్బంది సేవలు ఉంటాయని సమాధానమిచ్చారు. దీంతో ఆమె మంగళవారం ఉదయం దూర ప్రాంతం నుంచి సింహగిరికి చేరుకున్నారు. ఈ క్రమంలో పీఆర్వో కార్యాలయం వద్ద ఆర్జిత సేవలు గురించి ఆరా తీయగా, ఈ రోజు జరగడం లేదని సిబ్బంది తెలిపారు. సోమవారం ఫోన్ చేసి అడిగితే సేవలు ఉన్నాయని చెప్పి, ఇప్పుడు లేవని ఎలా అంటారని ప్రశ్నిస్తూ సిబ్బందితో ఆమె వాగ్వాదానికి దిగారు. చివరకు చేసేదేమీ లేక నిరాశతో వెనుదిరిగారు. ఆలయ వర్గాలకు, పీఆర్వో కార్యాలయానికి మధ్య సమన్వయం లేకపోవడం వల్లే ఈ సంఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. ఆర్జిత సేవల రద్దుపై ఆలయ అధికారులు పీఆర్వో కార్యాలయానికి స్పష్టమైన సమాచారం ఇవ్వలేదని తెలుస్తోంది. అంతేకాకుండా.. ఆర్జిత సేవలు ఉండవన్న విషయాన్ని మీడియాకు కూడా తెలియజేయలేదు.



'కుట్టు మిషన్ల శిక్షణ'లో అక్రమాలు

సమగ్ర విచారణకు వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం డిమాండ్



డీఆర్వోకి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు పేడాడ రమణి కుమారి, కార్పొరేటర్లు సాడి పద్మా రెడ్డి, శశికళ, నాయకురాలు పీలా వెంకటలక్ష్మి

మహారాణిపేట: కుట్టు మిషన్ల శిక్షణలో అక్రమాలు జరుగుతున్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు పేడాడ రమణి కుమారి డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ మహిళా విభాగం ప్రతినిధులతో కలిసి మంగళవారం డీఆర్వో భవానీశంకర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. కుట్టు మిషన్లతో పాటు శిక్షణకు ఉద్దేశించిన ఈ పథకంలో రూ.150 కోట్లకు పైగా స్కాం జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు 175 నియోజకవర్గాల్లో మూడు నుంచి ఐదు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, అందులో మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఆ మాట చెప్పి 50 రోజులు దాటినా 50 నియోజకవర్గాల్లో కూడా ఇప్పటికీ శిక్షణ మొదలు కాలేదన్నారు. కుట్టు మిషన్ల పేరు చెప్పి రూ.కోట్లు కొల్లగొట్టే ప్రయత్నం జరుగుతోందని రమణికుమారి ఆరోపించారు. ఈ పథకానికి సంబంధించి టెండర్‌లో కూడా అనుమానాలు ఉన్నాయని, ఎల్1కు కేవలం 5 శాతం పని మాత్రమే అప్పగించి.. ఎల్ 2, ఎల్ 3కి సుమారు 95 శాతం పనిని అప్పగించడంలో కూటమి ప్రభుత్వ ఉద్దేశం ఏమిటో తెలిపాలన్నారు. తక్కువ నాణ్యత కలిగిన మిషన్లను తీసుకొచ్చి రూ.4,300 విలువ చేస్తుందని చెప్పడం, ఒకరికి శిక్షణ కోసం అవుట్ సోర్సింగ్ సంస్థకు రూ.3,000 కేటాయించడంపై ఎన్నో సందేహాలు ఉన్నాయన్నారు. లక్ష మందికి శిక్షణ ఇచ్చేందుకు రూ.7,300 చొప్పున రూ.73 కోట్లు ఖర్చు అవుతుందని.. కానీ ఈ పథకం బడ్జెట్‌ను రూ.257 కోట్లకు పెంచి భారీ అవినీతికి తెరతీశారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, నిజానిజాలు ప్రజలకు తెలియజేయాలని డీఆర్వోను విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, శశికళ, మాజీ మహిళా జోనల్ ఇన్‌చార్జి పీలా వెంకట లక్ష్మి, దక్షిణ,ఉత్తర నియోజకవర్గాల మహిళా విభాగం అధ్యక్షులు బంగారమ్మ, పప్పల సునీత, జోత్స్న, శ్రీదేవి వర్మ, శ్రీదేవి, నాగమణి, సత్య, సుశీల, రామలక్ష్మి, నాగమణి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

నేడు కేంద్ర మంత్రి పర్యటన

మహారాణిపేట: కేంద్ర పోర్టులు, షిప్పింగ్ శాఖ సహాయ మంత్రి ఎస్.ఠాకూర్ బుధవారం పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. నోవాటెల్‌లో బస చేస్తున్న కేంద్ర మంత్రి ఉదయం 9.30 గంటలకు పోర్టు డీసీ జెట్టీకి వెళ్లి అక్కడ గార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం పోర్టులో జరిగే సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. తర్వాత డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌లో సమీక్ష నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3.40 గంటలకు షిప్‌యార్డులో సమీక్ష నిర్వహించి, సాయంత్రం 5 గంటలకు విమానాశ్రయం చేరుకుని ఢిల్లీ బయలుదేరుతారు.

రేపు తలసేమియా రన్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శాప్ ప్రతినిధులు

మధురవాడ: తలసేమియాపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈనెల 8వ తేదీన రన్ నిర్వహించనున్నట్లు డీఎస్‌వో జూన్ గ్యాలియేట్ తెలిపారు. ఈ మేరకు రన్‌కు సంబంధించిన పోస్టర్‌ను కొమ్మాది శాప్ స్టేడియంలో సంస్థ ప్రతినిధులు పోస్టర్ ఆవిష్కరించారు. ఆ రోజు ఉదయం 6 గంటలకు ఆర్కే బీచ్‌లో 10కె, 2కె, 3కె రన్‌లు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు

- 12 నుంచి 20వ తేదీ వరకు రెండు సెషన్లలో పరీక్షలు
- జిల్లాలో పరీక్షలు రాయనున్న 39,992 మంది విద్యార్థులు

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్‌ఐవో మురళీధర్ తెలిపారు. మొత్తం 39,992 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 32,780 మంది హాజరవుతుండగా.. 66 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అదే విధంగా ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 7,212 మంది హాజరవుతుండగా.. 15 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల్లో ఎటువంటి అవాంతరాలు చోటుచేసుకోకుండా జిల్లాను ఏడు జోన్లుగా విభజించి, పరీక్షల పర్యవేక్షణకు తనిఖీ అధికారులను నియమించారు. పరీక్షలకు సంబంధించిన ప్రశ్నా పత్రాలు, ఇతర సామగ్రిని భద్రపరిచేందుకు 14 స్టోరేజీ పాయింట్లను ఏర్పాటు చేశారు. నాలుగు ఫ్లెయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు.. ఫస్టియర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండియర్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల సాయంత్రం 5.30 గంటల వరకు జరగనున్నాయి. ప్రాక్టికల్ ఈ నెల 28 నుంచి జూన్ 1 వరకు నిర్వహించనున్నారు. జూన్ 4న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్, 6న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరగనుంది.

ఉక్కు పీఎఫ్ ట్రస్ట్‌కు బకాయిల చెల్లింపు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) ట్రస్టుకు యాజమాన్యం బకాయిలు చెల్లించిందని పీఎఫ్ ట్రస్టీలు చీకటి శ్రీనివాసరావు, రామచంద్రరాజు, సైనుబాబు తెలిపారు. ఉద్యోగుల జీతం నుంచి రికవరీ చేసే పీఎఫ్ అమౌంట్‌తోపాటు యాజమాన్యం వాటాను ప్రతీ నెలా ట్రస్ట్‌కు చెల్లించాలన్నారు. అయితే గత ఏడాది ఏప్రిల్ నుంచి వాటి చెల్లింపులు నిలిచి పోయాయన్నారు. దాంతో ఉద్యోగుల పీఎఫ్ ఖాతాలు అప్‌డేట్ చేయలేక పోతున్నామన్నారు. ఈ అంశంపై పీఎఫ్ కమిషనర్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారన్నారు. తాము పీఎఫ్ ట్రస్ట్ ప్రతినిధులుగా యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చామన్నారు. ఎట్టకేలకు యాజమాన్యం మార్చి 31న మొదట విడతగా రూ.429 కోట్లు, మంగళవారం రెండో విడతగా రూ.244 కోట్లు వడ్డీతో సహా చెల్లించినట్లు వారు తెలిపారు. అదే విధంగా ఎస్‌బీఎఫ్ ట్రస్ట్‌కు రూ.35 కోట్లు చెల్లించారన్నారు. దీంతో యాజమాన్యం పూర్తి బకాయిలు చెల్లించినట్లయిందని పేర్కొన్నారు. ట్రస్ట్‌కు చెల్లింపులు చేయడానికి సహకరించిన ట్రస్ట్ చైర్మన్ హేమంత్ కుమార్ ఝా, కార్యదర్శి ఎస్.రామప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



నీడ మాయం



నగరంలో అద్భుత దృశ్యం కనిపించింది. ఏడాదికి రెండు సార్లు ఏర్పడే 'జీరో షాడో' డే మంగళవారం ఆవిష్కృతమైంది. మధ్యాహ్నం 12.30 గంటలకు కొన్ని నిమిషాల పాటు నీడ మాయమైంది. సాధారణంగా సూర్యుడు మిట్ట మధ్యాహ్న సమయంలోనూ కాస్త ఉత్తరం వైపో, దక్షిణం వైపో వాలి ఉంటాడు. సూర్యుడి చుట్టూ తిరిగే మన భూమి అక్షం 23.5 డిగ్రీల వాలుతో ఉంటుంది. అందుకే మిట్ట మధ్యాహ్నంలోనూ నీడ నిటారుగా అయినా మనకు కన్పిస్తుంది. అయితే, ఏడాదికి రెండు సార్లు ప్లస్ 23.5, మైనస్ 23.5 డిగ్రీల అక్షాంశాల మధ్య ప్రాంతాల్లో సూర్యుడు మిట్ట మధ్యాహ్నం, సరిగ్గా నడి నెత్తి మీదికి వస్తాడు. ఉత్తరాయణంలో ఒకసారి, దక్షిణాయణంలో ఒకసారి సూర్యుడి వంపు అక్షాంశంతో సమానమవుతుంది. అప్పుడు సూర్యుడు సరిగ్గా నడి నెత్తి మీదికి వస్తాడు. దీంతో ఆయా వస్తువుల నీడ భూమి మీద పడదు. ఈ పరిస్థితి కొద్ది సేపే ఉంటుంది. దీన్ని జీరో షాడో డే అని అభివర్ణిస్తారు. దీన్ని తిలకించేందుకు ప్రజలు ఆసక్తి కనబర్చారు.





– ఫొటోలు, సాక్షి, ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఏయూలో విద్యార్థులకు చోటేదీ..?

- పోటీ పరీక్షార్థులకు మొండిచేయి
- వసతి కోసం వేడుకున్నా పట్టని అధికారులు



ఆంధ్ర విశ్వ విద్యాలయం ఉపకులపతి చాంబర్ వద్ద వేచి ఉన్న విద్యార్థులు

విశాఖ విద్య: పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే క్రమంలో వసతి కావాలని కోరినా.. యూనివర్సిటీ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం వర్సిటీ వైస్ ఛాన్సలర్‌ను కలిసేందుకు వెళ్లిన విద్యార్థులను అనుమతించకపోవటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వైస్ ఛాన్సలర్ చాంబర్ వద్దే విద్యార్థులు పడిగాపులు కాశారు. డీఎస్సీ, ఇతర పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వర్సిటీ విద్యార్థులకు ఏటా వేసవి సెలవుల్లో యూనివర్సిటీలో వసతి కల్పించేవారు. కానీ ఈ సంవత్సరం వర్సిటీ వసతి గృహాలకు జీవీఎంసీ తాగునీరు రావటం లేదనే కారణంతో విద్యార్థులకు అవకాశం కల్పించకపోవటంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వర్సిటీ విద్యార్థులకు వసతి కల్పిస్తామని హామీ ఇచ్చి కూడా వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, ప్రిన్సిపాళ్లు, చీఫ్ వార్డెన్లు చుట్టూ తిప్పించుకొని చివరకు నిరాశ మిగిల్చారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వీసీని కలవడానికి కూడా పర్మిషన్ ఇవ్వడంలేదని, తాగునీరు లేదని కారణంతో వసతి కల్పించకపోవటంపై విద్యార్థులు ఆగ్రహం వక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో యూనివర్సిటీలో నాణ్యమైన విద్య ఎలా అందిస్తారని విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నించారు. యూనివర్సిటీలో ఎన్నడూ లేని విధంగా జరుగుతున్న పరిణామాలపై విద్యార్థులందరినీ ఏకం చేసి, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఓ విద్యార్థి సంఘం నాయకుడు తెలిపాడు.

నర్సుల పోస్టులకు పైరవీలు!

- రంగంలో దిగిన దళారులు
- అభ్యర్థులకు ఫోన్ల మీద ఫోన్లు
- రూ.3 లక్షల నుంచి 5 లక్షల వరకు డిమాండ్
- అధికారులపై కూటమి నేతల ఒత్తిడి



వైద్య ఆరోగ్యశాఖ ఆర్డీ కార్యాలయం

మహారాణిపేట: 'హలో మేము విశాఖ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నాం. మీరు స్టాఫ్ నర్సు పోస్టుకు దరఖాస్తు చేసుకున్నారా? మీకు ఆ పోస్టు కావాలంటే డబ్బులు ఇవ్వాలి.' అంటూ కొందరు వ్యక్తులు అభ్యర్థులకు ఫోన్లు చేస్తూ.. డబ్బులు డిమాండ్ చేస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీ ప్రక్రియ తుది దశకు చేరుకోవడంతో దళారుల బెడద ఎక్కువైంది. ఈ పోస్టుల భర్తీకి సంబంధించి ఇప్పటికే ప్రీ ఫైనల్ జాబితా విడుదల కాగా.. తుది ఎంపిక జాబితా వెలువడనున్న తరుణంలో కొందరు అభ్యర్థులు దళారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన ఒక ముఠా అభ్యర్థుల ఆశలను సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తోంది. పోస్టింగ్ ఇప్పిస్తామని నమ్మబలుకుతోంది. ఒక్కో పోస్టుకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు డిమాండ్ చేస్తూ బేరసారాలకు దిగుతోంది. ఈ విషయం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల దృష్టికి వెళ్లడంతో.. అటువంటి మోసగాళ్లను నమ్మి డబ్బులు పోగొట్టుకోవద్దని హెచ్చరికలు జారీ చేశారు.

అధికారులపై 'రాజకీయ' ఒత్తిడి

నర్సుల పోస్టుల భర్తీ చివరి దశకు చేరుకోవడంతో కొందరు కూటమి నేతలు ఈ పోస్టులను ఆదాయ వనరులుగా మార్చుకోవాలని భావిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో పోస్టుకు పెద్ద మొత్తంలో ధర నిర్ణయించి.. డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కూడా ఈ పైరవీలకు సహకరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రజాప్రతినిధుల నుంచి పెద్ద సంఖ్యలో సిఫార్సు లేఖలు వస్తున్నట్లు సమాచారం. వీటిని ఆసరాగా చేసుకుని కొందరు అధికారులు తమ పనులు చక్కబెట్టుకుంటున్నారని తెలుస్తోంది. ముఖ్యంగా ఈ పోస్టుల భర్తీలో వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ డైరెక్టర్(ఆర్డీ)పై తీవ్ర ఒత్తిడి ఉన్నట్లు సమాచారం. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నుంచి సిఫార్సు లేఖలతో పాటు, వారి వ్యక్తిగత సహాయకుల నుంచి కూడా ఆర్డీకి నిరంతరం ఫోన్లు వస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కో పోస్టుకు భారీ స్థాయిలో డిమాండ్ ఉండటంతో కొంతమంది బేరసారాల్లో నిమగ్నమైనట్లు సమాచారం. ఒక్కొక్క పోస్టుకు రూ.3 లక్షల నుండి రూ.5 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.

పెరిగిన పోస్టులు.. తీవ్రమైన పోటీ

స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీలో ఈసారి పోస్టుల సంఖ్య గణనీయంగా పెరగడం గిరాకీకి కారణమైంది. ప్రారంభంలో ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో 106 నర్సు పోస్టులు ఖాళీగా ఉండగా, ఆ తర్వాత మరో 264 పోస్టులు ఈ ప్రక్రియలో చేరాయి. దీంతో మొత్తం 370 పోస్టుల(ఒక సంవత్సరం ఒప్పంద ప్రతిపదికన) భర్తీకి వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ డైరెక్టర్ కార్యాలయం చర్యలు చేపట్టింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం జిల్లాల నుంచి మొత్తం 8,309 దరఖాస్తులు అందాయి. ఈ నేపథ్యంలో ఒక్కో పోస్టుకు పోటీ తీవ్రంగా నెలకొంది.

దళారులను నమ్మవద్దు



పోస్టుల భర్తీ ప్రక్రియ దాదాపు పూర్తయింది. మెరిట్ ప్రాతిపదికన, పారదర్శకంగానే అంతా జరుగుతుంది. ఎస్సీ వర్గీకరణ వంటి కొన్ని అంశాలపై ప్రభుత్వ వివరణ కోసం లేఖ రాశాం. అనుమతి రాగానే పోస్టింగ్ ప్రక్రియ చేపతాం. దళారుల మాటలు నమ్మి ఎవరికీ డబ్బులు ఇవ్వవద్దు. అర్హత, మెరిట్, రోస్టర్ ప్రకారమే మెరిట్ జాబితా తయారు చేస్తున్నాం.

– డాక్టర్ రాధారాణి, ఆర్డీ, వైద్య ఆరోగ్యశాఖ, విశాఖపట్నం

చీటింగ్ కేసులో వ్యక్తికి రెండేళ్ల జైలు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధిలో 2022లో నమోదైన ఓ చీటింగ్ కేసులో నిందితుడికి విశాఖ నాలుగో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు రెండేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధించింది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలివి. 2022 ఫిబ్రవరి 18న కె.వీర్రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బొత్స డేనియల్ సునీల్‌కుమార్‌పై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. దక్షిణాఫ్రికా నుంచి దిగుమతి చేసుకున్న మాంగనీస్‌ను పోర్టు ద్వారా అందజేస్తానని చెప్పి సునీల్‌కుమార్.. వీర్రాజుతో ఒప్పందం చేసుకున్నాడు. ఇందుకు రూ.11 లక్షల సైతం తీసుకున్నాడు. అయితే ఒప్పందం ప్రకారం మాంగనీస్ అందజేయకుండా తప్పించుకుని తిరుగుతుండటంతో వీర్రాజు ఎంవీపీ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో కేసు నమోదు చేసిన ఎంవీపీ పోలీసులు సునీల్‌కుమార్‌ను కోర్టులో హాజరుపరచడంతో పాటు ఫిర్యాదుదారుడి తరపున దర్యాప్తు వివరాలను కోర్టుకు అందజేశారు. ఈ మేరకు కోర్టు మంగళవారం తుది తీర్పు వెలువరించింది.

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
ఫారం ధర	: రూ.130
బ్రాయిలర్ (లైవ్)	: రూ.150
స్కిన్	: రూ.270
స్కిన్‌లెస్	: రూ.280

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	500.00
విజయనగరం	504.00
శ్రీకాకుళం	504.00

జీవీఎంసీ అధికారి పేరుతో అక్రమ వసూళ్లు

జగదాంబ: జీవీఎంసీ రెవెన్యూ అధికారినంటూ ఓ వ్యక్తి 35వ వార్డు పూర్ణా మార్కెట్ ప్రాంతంలోని దుకాణదారుల నుంచి అక్రమంగా డబ్బు వసూలు చేస్తున్న ఘటన వెలుగులోకి వచ్చింది. ముఖానికి రుమాలు కట్టుకుని.. నంబర్ ప్లేట్ లేని కారులో వచ్చిన ఆ వ్యక్తి.. పన్నులు కట్టాలని కొందరిని, పన్నులు తగ్గిస్తానని మరికొందరిని బెదిరించి డబ్బులు వసూలు చేశాడు.

ఓ హాట్ చిప్స్ దుకాణం వద్దకు వెళ్లి రూ.3000 పన్ను కట్టాలని డిమాండ్ చేసి, ఆ తర్వాత తగ్గిస్తానని చెప్పి రూ.1000 బెదిరించి తీసుకున్నట్లు తెలిసింది. అలాగే ఓ గ్యాస్ ఏజెన్సీ నుంచి గ్యాస్ సిలిండర్‌ను కూడా తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ విషయంపై జీవీఎంసీ జోన్-4 రెవెన్యూ అధికారి సీతారాంను వివరణ కోరగా.. తమ శాఖ నుంచి ఎవరూ వసూళ్లకు వెళ్లలేదని స్పష్టం చేశారు. జీవీఎంసీ పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే జోన్-4 కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. ప్రస్తుతం రెవెన్యూ వసూళ్ల లక్ష్యాలను చేరుకోవడానికి అధికారులు ప్రయత్నిస్తున్న తరుణంలో ఇలాంటి మోసాలు జరగడం గమనార్హం.

VAPMS COLLEGE OF PHYSIOTHERAPY
Vizag. (affiliated to Dr. NTRUHS, Vijayawada)
MPT Admission Notification 2024-25
(Under management quota)
Applications are invited for admission into Full time Master of Physiotherapy course under management quota for the academic year 2024-25. Filled in applications are to be submitted at vapms@rediffmail.com on or before 10-05-2025. For further details please contact: 9848606769
Visakhapatnam
Date: 06-05-2025 Sd/ Principal

హైకోర్టు అసిస్టెంట్ పీపీగా నరసింగరావు



విశాఖలీగల్: విశాఖ బార్ అసోసియేషన్ సభ్యుడు ఎ.నరసింగరావు హైకోర్టు అసిస్టెంట్ ప్రభుత్వ ప్లీడర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి జి.ప్రతిభాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఈ పదవిలో మూడేళ్లపాటు కొనసాగుతారు. విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.కె.శ్రీనివాస్, సీనియర్ న్యాయవాది పి.ఎస్.నాయుడు, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, కార్యదర్శి కె.పి.నాయుడు తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీగా రామలక్ష్మి

మహారాణిపేట: డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో భాగంగా కాకినాడ ఎస్ఈజెడ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.వి.రామలక్ష్మిని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారిగా నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

8 నుంచి 'పెట్రోలియం నేచురల్ గ్యాస్' స్టాండింగ్ కమిటీ పర్యటన

మహారాణిపేట: పెట్రోలియం నేచురల్ గ్యాస్‌కు సంబంధించిన పార్లమెంటరీ స్థాయి స్టాండింగ్ కమిటీ ఈ నెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు విశాఖపట్నంలో పర్యటించనుంది. రాజ్యసభ, లోక్‌సభ సభ్యులతో కూడిన ఈ కమిటీ వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటుంది. అలాగే పలు ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశమై సమీక్షలు నిర్వహించనుంది.

ఎంఎస్‌ఎంఈ పార్కుతో యువతకు ఉపాధి

రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు



కృష్ణాపురంలో ఎంఎస్ఎంఈ పార్కు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి కొండపల్లి

పద్మనాభం: ఎంఎస్ఎంఈ పార్కుతో ఉత్తరాంధ్రలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కృష్ణాపురంలో రూ.12.40 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఈ పార్కుకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలోనూ ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో భీమునిపట్నం నియోజకవర్గం పద్మనాభం మండలం కృష్ణాపురంలో మొట్టమొదటగా ఎంఎస్ఎంఈ పార్కుకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ పరిశ్రమల పార్కు నిర్మాణానికి భూములిచ్చిన వారికి న్యాయం చేస్తామన్నారు. వచ్చే ఏడాది జూన్ నాటికి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తుందన్నారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ పరిశ్రమల పార్కుకు కేటాయించిన స్థలంలో మొదట 23 ఎకరాలను అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలో ఇక్కడ పనులు మొదలు పెడతామని చెప్పారు. కృష్ణాపురం ఈనాం భూముల రైతులకు పట్టాదారుల పాస్ పుస్తకాలు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎంఎస్ఎంఈ చైర్మన్ శివశంకర్, ఆర్డీవో సంగీత్ మాథుర్, సర్పంచ్ మొకర లక్ష్మీభవాని, ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు లక్ష్మి, తహసీల్దార్ కాకర ఆనందరావు, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, నాయకులు కె.రమణ, కె.దామోదరావు, కె.నగేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తున్న స్టాళ్లపై కేసులు

రైల్వేస్టేషన్‌లో తూనికల కొలతల శాఖ తనిఖీలు



తనిఖీల్లో పాల్గొన్న తూనికల కొలతల శాఖాధికారులు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని పలు స్టాళ్లలో అధిక ధరలకు వస్తువులు విక్రయిస్తున్నారన్న ఫిర్యాదులతో తూనికల కొలతల శాఖ అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. డిప్యూటీ కంట్రోలర్ కె.థామస్ రవికుమార్ నేతృత్వంలో ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం నుంచి 8వ నంబర్ ప్లాట్‌ఫాం వరకు ఉన్న వివిధ స్టాళ్లను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పలు స్టాళ్ల నిర్వాహకులు బిస్కెట్లు, శీతల పానీయాలను ఎమ్మార్పీకి మించి రూ.5 నుంచి రూ.15 అదనంగా వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. నిబంధనలు ఉల్లంఘించిన స్టాళ్ల నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. ప్యాకేజీ వస్తువులపై ముద్రించిన ధరకు మించి ఎట్టి పరిస్థితుల్లోనూ చెల్లించవద్దని ప్రయాణికులకు అధికారులు విజ్ఞప్తి చేశారు. తనిఖీల్లో అసిస్టెంట్ కంట్రోలర్లు పి.డి.వి.అప్పలరాజు, ఎస్.ఎం.రాధాకృష్ణ, బి.రామచంద్రయ్య, పి.చిన్నమ్మలతో పాటు ఇన్‌స్పెక్టర్లు వి.రామారావు, ఎస్.ఉమా సుందరి, డి.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

అరుదైన నరాల వ్యాధికి విజయవంతంగా చికిత్స



కోలుకున్న మహిళకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న హెల్త్ సిటీ కేర్ వైద్యులు

ఆరిలోవ: అరుదైన నరాల వ్యాధితో బాధపడుతున్న ఓ మహిళకు హెల్త్‌సిటీ కేర్ ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా చికిత్స అందించారు. వ్యాధి నుంచి సంపూర్ణంగా కోలుకున్న ఆమెకు మంగళవారం వైద్యులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో న్యూరాలజిస్ట్ డాక్టర్ ఎం.జి.వి ఆదిత్య ఈ వివరాలు వెల్లడించారు. నగరానికి చెందిన 35 ఏళ్ల రాధారాణి (ఫుడ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో అధ్యాపకురాలు) న్యూరోమైలిటీస్ ఆప్టికా స్పెక్ట్రం డిసార్డర్ అనే అత్యంత అరుదైన నరాల వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించామన్నారు. ఈ వ్యాధి సుమారు 10 లక్షల మందిలో ఒకరికి మాత్రమే వస్తుందన్నారు. గత ఏడాది అక్టోబరులో రాధారాణి ఆస్పత్రిని సంప్రదించగా.. వైద్య పరీక్షల అనంతరం ఆమె వెన్నుపూసలో ఎక్కువ భాగం వాపుతో పాటు కాళ్ల నరాలు పనిచేయడం లేదని గుర్తించినట్లు చెప్పారు. వెంటనే ఆమెకు ప్లాస్మా ఎక్సేంజ్ ట్రీట్‌మెంట్‌ను విజయవంతంగా అందించినట్లు వెల్లడించారు. దాదాపు ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా మందులు వాడటంతో ఆమె పూర్తిగా కోలుకున్నట్లు వెల్లడించారు. ఈ చికిత్స విజయవంతంలో కేర్ ఆస్పత్రి యాజమాన్యంతో పాటు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ రాము తదితరుల సహకారం ఎంతో ఉందని డాక్టర్ ఆదిత్య తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులకు రాధారాణి కృతజ్ఞతలు తెలిపారు.

గెజిటెడ్ సంతకం లేదని పరీక్షకు అనుమతించలేదు

గాయత్రి కళాశాల వద్ద ఈసెట్ అభ్యర్థి ఆవేదన



ఆవేదనతో వెనుదిరుగుతున్న అభ్యర్థి, తల్లి

మధురవాడ: హాల్ టికెట్‌పైన గెజిటెడ్ సంతకం లేదని పరీక్షా కేంద్రంలోకి అనుమతించకపోవడంతో పరీక్ష మిస్ అయ్యానని విద్యార్థి వాపోయాడు. వివరాలు ఇలా ఉన్నాయి. సింహాచలంకి చెందిన తాతపూడి ఆదిత్య డిప్లమా చదువుకున్నాడు. ఈసెట్ పరీక్ష కోసం మధురవాడ గాయత్రీ విద్యాపరిషత్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రానికి మంగళవారం ఉదయం చేరుకున్నాడు. హాల్ టికెట్ మీద గెజిటెడ్ సంతకం లేదని పరీక్షా కేంద్రంలోకి అనుమతించలేదు. దీంతో సంతకం చేయించుకొని వచ్చేసరికి టైం అయిపోయిందని సిబ్బంది లోపలకు పంపించలేదని విద్యార్థి, తల్లి సంధ్య వాపోయారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే తాము గెజిటెడ్ సంతకం ఉండాలని ఎవరికీ చెప్పలేదని, సకాలంలో వచ్చిన వారిని పరీక్షా కేంద్రంలోకి అనుమతించామని నిర్వాహకులు చెబుతున్నారు.

10 నుంచి విశాఖ-బ్రహ్మపూర్ పాసింజర్ రద్దు

తాటిచెట్లపాలెం: ఆధునికీకరణ పనుల కారణంగా ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు విశాఖపట్నం-బ్రహ్మపూర్ (58532), బ్రహ్మపూర్-విశాఖపట్నం (58531) పాసింజర్‌ను రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఓ ప్రకటనలో తెలిపారు. వేసవి దృష్ట్యా చర్లపల్లి-నహర్‌లగున్-చర్లపల్లి స్పెషల్ రైలును మరికొంత కాలం పొడిగించినట్లు పేర్కొన్నారు. చర్లపల్లి-నహర్‌లగున్(07046) స్పెషల్ ఈ నెల 10, 17, 24, 31 తేదీల్లో(ఆదివారం) చర్లపల్లిలో ఉదయం 8.40 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 9.13 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 9.15 గంటలకు బయలుదేరి తర్వాత రోజు(సోమవారం) సాయంత్రం 4 గంటలకు నహర్‌లగున్ వెళ్తుంది. నహర్‌లగున్-చర్లపల్లి (07047) స్పెషల్ ఈ నెల 13, 20, 27, జూన్ 3వ తేదీల్లో(మంగళవారం) నహర్‌లగున్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరి గురువారం ఉదయం 6.20 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 6.22 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 9.30 గంటలకు చర్లపల్లి వెళ్తుంది.

14 నుంచి ఫుడ్ ప్రాసెసింగ్‌పై శిక్షణ

విశాఖ సిటీ : ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద ఈ నెల 14 నుంచి 24వ తేదీ వరకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫ్యాప్సీ) కార్యదర్శి పి.వైదేహి తెలిపారు. ప్రముఖ జాతీయ సంస్థలు, నిపుణులతో పది రోజుల పాటు ప్రతి రోజు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిక్షణా కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. ఇందులో ఫుడ్ ప్రాసెసింగ్‌లో వ్యాపార అవకాశాలు, వ్యాపార ప్రణాళిక, మార్కెటింగ్, లైసెన్సులు, నిబంధనలు, నాణ్యతా ప్రమాణాలు, ఫుడ్ ప్రాసెసింగ్‌లో టెక్నాలజీ, ఇన్నోవేషన్, బ్రాండింగ్, డిస్ట్రిబ్యూషన్, ప్రభుత్వ పథకాలు, రాయితీలు, ఇలా అన్ని అంశాలపై వివరిస్తారని చెప్పారు. ఈ తరగతులకు హాజరయ్యే వారికి ఫ్యాప్సీ నుంచి ఈ-సర్టిఫికెట్ కూడా అందిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు 9391422821, 8008847676 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ఏవోబీలో టెన్షన్ టెన్షన్

- మావోయిస్టుల సంచారంపై నిఘా వర్గాల హెచ్చరిక
- అప్రమత్తమైన పోలీసులు



ముంచంగిపుట్టులో తనిఖీ చేస్తున్న పోలీసులు

ముంచంగిపుట్టు: ఆంధ్రా- ఒడిశా సరిహద్దు ప్రాంతంలో పోలీసులు అప్రమత్తయ్యారు. ఇటీవల జిల్లాలోని కాకులమామిడి, కాంటవరం అటవీ ప్రాంతంలో రెండు సార్లు మావోయిస్టులకు, పోలీసులకు మధ్య ఎదురుకాల్పులు జరగడం తెలిసిందే. అప్పటినుంచి ఏవోబీ సరిహద్దులో మావోయిస్టులు తలదాచుకుంటున్నారన్న నిఘా వర్గాల హెచ్చరికలతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. స్థానిక ఎస్ఐ జె.రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు మండల కేంద్రంలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఏవోబీ సరిహద్దులో ఉన్న గిరిజన గ్రామాల నుంచి మండల కేంద్రాలకు వచ్చే వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రయాణికుల బ్యాగులు, లగేజీలు కుణ్ణంగా పరిశీలించి, విడిచి పెట్టారు.మండల కేంద్రంలో సీఆర్‌పీఎఫ్ పోలీసులు, బలగాలు గస్తీ నిర్వహించాయి.అనుమానితులను ప్రశ్నించి, వివరాలు సేకరించి విడిచి పెడుతున్నాయి.

ఒడిశా పోలీసు బలగాలు..

ఒడిశా పోలీసు బలగాలు సైతం మాచ్‌ఖండ్, ఒనకఢిల్లీ, పాడువ, జోలాపుట్టు గ్రామాల్లో అడుగడుగునా తనఖీలు చేస్తున్నాయి. ఏవోబీలోని గుగ్రసేత్, రూడకోట, జోడం గ్రామాల్లో గ్రామాల్లోని అవుట్ పోస్టుల పరిధిలో పోలీసు బలగాలు సరిహద్దు గ్రామాల్లోని అటవీ ప్రాంతం వైపు కదులుతూ జల్లెడ పడుతున్నాయి. దీంతో ఎప్పుడూ ఏ సంఘటన జరుగుతుందో అంటూ మారుమూల గ్రామాల గిరిజనులు భయం భయంగా ఉంటూ గ్రామాలకే పరిమితం అయ్యారు.

ప్రజాప్రతినిధులకు నోటీసులు

ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నాయనే నిఘా వర్గాల సమాచారంతో పోలీసులు ముందస్తుగా అప్రమత్తం అయ్యారు. తనిఖీలతో పాటు మావోయిస్టుల హిట్ లిస్టులో ఉన్న నేతలతో పాటు సర్పంచులు, ఎంపీటీసీలకు పోలీసు అలెర్ట్ పేరుతో నోటీసులు జారీ చేశారు. ఈ మధ్య కాలంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల అనంతరం నిషేధిత మావోయిస్టు సభ్యులు గ్రూపులుగా ఏర్పడ్డారు. వీరు ఏజెన్సీ ప్రాంతం మొత్తం విస్తరించి, ప్రభుత్వం వ్యతిరేక కార్యకలాపాలు చేయుటకు అవకాశం ఉంది. అందువల్ల మావోయిస్టు పార్టీ హిట్ లిస్టు ఉన్న లేదా పొలిటికల్ లీడర్ అయిన మీరు పోలీసు వారి అనుమతి లేకుండా లోపల ఉన్న గ్రామాలకు వెళ్లరాదు. మీరు సురక్షిత ప్రాంతాల్లో మాత్రమే ఉండాలని నోటీసు ద్వారా తెలియజేయడమైనదని స్థానిక పోలీసులు పేర్కొన్నారు.

దర్యాప్తులో ఫోరెన్సిక్ ఆధారాలు కీలకం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి



శిక్షణలో పాల్గొన్న పోలీసు అధికారులు, వైద్యులు, న్యాయవాదులు

అనకాపల్లి: నేరాల దర్యాప్తులో ఆధునిక శాస్త్రీయ విధానాల ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని, కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి అన్నారు. స్థానిక గాంధీనగరం ఎస్ఆర్ శంకరన్ హాల్లో మంగళవారం పోలీసు, వైద్యులు, న్యాయవాదులతో నేరచరిత్రపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేరస్థలాల్లో ఫోరెన్సిక్ ఆధారాల సేకరణ, నిర్వహణ, 'చైన్ ఆఫ్ కస్టడీ' పాటించాల్సిన విధానాలపై అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. బాధితులకు న్యాయం జరగాలంటే దర్యాప్తు అధికారులు, ఫోరెన్సిక్, వైద్యులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పరస్పర సహకారంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఫోరెన్సిక్ ఎవిడెన్స్ మేనేజిమెంట్ శిక్షణ ద్వారా నిందితులకు తగిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ వర్క్‌షాప్‌లో నార్కోటిక్స్, మత్తు పదార్థాలు, విషపదార్థాలు (టాక్సికాలజీ), డిజిటల్ ఆధారాలు, సైబర్ నేరాల పరికరాలు, ఆడియో-వీడియో ఫుటేజ్, డీఎన్ఏ, రక్త నమూనాలు, మానవ అవయవాలు వంటి ఆధారాల సేకరణ, ప్యాకింగ్, భద్రపరచే విధానంపై దృష్టి సారించి, సంబంధిత ఆధారాలతో సకాలంలో కోర్టుకు ఇవ్వడం వల్ల నిందితులకు శిక్ష పడుతుందన్నారు. అంతకుముందు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఆర్.ఎఫ్.ఎస్.ఎల్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వి.నాగరాజు, శాస్త్రీయ సహాయకులు ఎం.రాంబాబు, పి.వి.ఎస్.బి.చలపతి, ఇ.కిరణ్ కుమార్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, డీఎస్పీలు ఎం.శ్రావణి, పి.శ్రీనివాసరావు, వి.విష్ణు స్వరూప్, ఫోరెన్సిక్ వైద్యులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, సీఐలు లక్ష్మణ్ మూర్తి, బాల సూర్యారావు, లక్ష్మి, విజయ, ఎస్ఐలు ప్రసాద్, రమణయ్య, సురేష్ బాబు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

దస్తావేజు పోయినది
వేమూరి రాబిన్సన్ థియోడార్ అను నేను, డోర్.నెం. 51-2-4/4, విశాఖపట్నం. A.P., నందు నివాసముంటున్నాను. నా యొక్క నా యొక్క ఆస్తి తాలూకా Document No. 3107/2016, 5-5-2025 తేదీన అనకాపల్లి నుండి విశాఖపట్నం ట్రావెల్ చేస్తుండగా మద్దిలపాలెం బస్సు స్టాండు దగ్గర దస్తావేజు పోయినది. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు. ఫోన్: 810680 2836

CHANGE OF NAME
I, A.R.S.V.N.M. DEVI, wife of ARATIKATLA BASAVESWARA RAO, residing at Door No: 53-36-4/3, Sri Jagadeeswari Enclave, K.R.M. Colony, Chaitanya Nagar, Visakhapatnam - 530001, hereby declare that I have changed my name from A.R.S.V.N.M. DEVI to ARATIKATLA NAGA MALLESWARI as per Govt of AP Certificate No: IN-AP84931435410287X issued on 23rd April, 2025. In the future, I shall be known as ARATIKATLA NAGA MALLESWARI for all purposes.

CHANGE OF NAME
I, GANGULA VIJAYA PARVATHI (New Name), S/o.Gangula Lakshmana Murthy, previously called as DADISETTI VIJAYA PARVATHI (Old Name) resident of Door No. 9-19, K.Nagarapalem, Bheemili, Visakhapatnam, Andhra Pradesh- 531163. Now changed my name from DADISETTI VIJAYA PARVATHI (Old Name) to GANGULA VIJAYA PARVATHI (New Name). Henceforth I will be called as GANGULA VIJAYA PARVATHI (New Name) for all purposes.

Education

BIBLE CLASSES
■ వేసవి బైబిల్ తరగతులు ప్రాథమిక పాఠములు నేర్పించబడును. మే 15th నుండి 31st వరకు, ప్రతిరోజు సాయంత్రం 6.30 గంటల నుండి 8.30 గంటల వరకు. మురళి నగర్, బ్యాంక్ స్ట్రీట్, విశాఖపట్నం. ఫోన్ : 97002 07070, 98853 22348 [SCA25003315]

Wanted

■ మీ ఇంటివద్దనే వుంటూ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25-30వేలు వరకు సంపాదించుకోండి. ఆడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95504 67459. [M-1268571]

■ Walk-in-Interview: A Fast Growing Org. Wanted The Positions For Vizag Branches: 1. Chief Admn Officers (Only Male). Qlf: Retd, To be Retd, VRS (State/Central Govt) & Any Pvt Sec. 2. Co-Ordinators (M/F). Qlf: Age 30 yrs & Above, Any Degree. Min 1 Yr. Exp. in Any Dept. 3) Client Supporting Manager (F), Age 30 Yrs & Above. Any Degree. Min 1 Yr Exp. in any Trade. attractive yearly Income Package Decided in Interview at Office Premises on 7 & 8 May. Cont: 96768 11666. [V- 3500]

■ శివకార్తికేయ హోంకేర్‌లో వృద్ధులను,పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావాలి. ఫ్రీ వసతి భోజనం. జీ: 18K. ఫోన్: 9912011499, 9912011899 [SCA-25003226]

Services

GOLD LOANS
■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 13756]

CHANGE OF NAME
■ I, BUNGA VINEELA, Previously Called CHEEDI VINEELA, Resident of D.No. 50-40-16/5/3, TPT Colony, Opposite Vasanthabala School, P & T Colony Post, Seethammadhara, Vishakhapatnam – 530013, now Changed my name, CHEEDI VINEELA, D/o. VISHNU MURTHY (Old name) to BUNGA VINEELA, D/o. BUNGA BABU RAO (New name) Henceforth called as BUNGA VINEELA for All purpose [HA-11385]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Real Estate

PLOT FOR SALE
■ అతి తక్కువ ధరకే ఇంటి స్థలం. గాజువాక దగ్గరలో, GVMC పరిధిలో 90, 100, 150 గజాలు ప్లాట్లు కలవు గజం ధర : 5,999/-, రిజిస్ట్రేషన్ ఫ్రీ. ఫోన్ : 91601 91101 [SCA25003319]

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మురళీనగర్, మాధవధార	: 90101 33346
NAD, కంచరపాలెం	: 90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	: 70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	: 90100 55116
డాబాగార్డెన్స్, జగదాంబ, MVP కాలనీ, మద్దిలపాలెం	: 90101 96663
గాజువాక	: 97059 33394

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం